

ఎన్‌బియు సర్వే పరిశీలన

ప్రజాశక్తి- డెంకాడ

మండలం జొన్నాడ గ్రామంలో జరుగుతున్న ఎన్‌బియు సర్వేను డిఆర్‌డిఎ పీడీ ఎ. కళ్యాణ చక్రవర్తి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంఘ సభ్యులు జీవనోపాదులు, సభ్యులు పిల్లల విద్యార్హత డేటా, ఉపాధి కోసం చూస్తున్న యువత వివరాలు సేకరణకు సంబందించిన నైబర్ హుడ్ బిజినెస్ యూనిట్ సర్వేను ఆయన పరిశీలించి విఒఎలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిపిఎం ఎల్‌హెచ్‌ఎం జయశ్రీ, డిపిఎం రవి, ఎసి ఎస్.రాజకుమార్, సీసీలు, ఎపిఎం, జొన్నాడ గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా విమానాశ్రయం పనులు

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, దీన్నిబట్టి ఆరు నెలల ముందే పూర్తయ్యే అవకాశం ఉందనికేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. రాష్ట్ర మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి ఆయన ఆదివారం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం జిల్లా అధికారులు, జిఎంఆర్, ఎల్ అండ్ టి ప్రతినిధులతో విమానాశ్రయ నిర్మాణంపై సమీక్షించారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ, షెడ్యూల్ ప్రకారం 2026 డిసెంబర్ నాటికి ఎయిర్‌పోర్టు పూర్తి కావాల్సి ఉందని, కానీ ప్రస్తుత పనుల తీరును బట్టి ఆరు నెలల ముందుగా 2026 జూన్ నాటికే విమానాశ్రయం సిద్ధమవుతుందని చెప్పారు. ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చే ఈ విమానాశ్రయ నిర్మాణాన్ని, ఈ ప్రాంత వాసిగా తాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నానని వెల్లడించారు.

గత నెల 11వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమానాశ్రయాన్ని సందర్శించేనాటికి 31.8శాతం పనులు జరిగాయని, ప్రస్తుతం 36.6శాతం పూర్తయిందని తెలిపారు. జూలై 11 నాటికి మట్టి పనులు 97.3శాతం పూర్తికాగా, ప్రస్తుతం 98శాతం పూర్తయ్యాయన్నారు. గత నెలతో పోలిస్తే రన్ వే నిర్మాణ పనులు 32 శాతం నుంచి 38.67 శాతానికి, టాక్సీ వే పనులు 16.7శాతం నుంచి 20.78 శాతానికి, టెర్మినల్ నిర్మాణ పనులు 22.5శాతం నుంచి 27.28శాతానికి పూర్తయ్యాయని తెలిపారు. లక్ష్యానికి అనుగుణంగా పనులు నిర్వహిస్తున్న జిఎంఆర్, ఎల్‌అండ్‌టి కంపెనీలను మంత్రి అభినందించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా చాలా చోట్ల విమానాశ్రయాలను నిర్మించాల్సి ఉందని, అవసరమైన భూమి, సాంకేతిక అంశాలు అనుకూలిస్తే వీటిని చేపడతామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మూలపేట ధగదర్తి, నాగార్జునసాగర్, కుప్పం వద్ద కూడా విమానాశ్రయ నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. అనంతపురం, ఒంగోలులో కూడా విమానాశ్రయం నిర్మించాలని ఆ ప్రాంతవాసులు అడుగుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో గత ప్రభుత్వం విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని, కావాల్సిన భూములను అప్పగించలేదని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రైల్వే జోన్ పనులను వేగవంతం చేశామని, సుమారు 52.5ఎకరాల భూమిని, కావలసిన ఇతర అనుమతులు కూడా మంజూరు చేస్తున్నామని అన్నారు. భోగాపురం విమానాశ్రయానికి విశాఖ వైపు నుంచే ఎక్కువగా ప్రయాణికులు వచ్చే అవకాశం ఉందని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాతీయ రహదారిపై 12చోట్ల మార్పులు చేయాల్సి ఉందని చెప్పారు. దీనికోసం నేషనల్ హైవే అథారిటీతో కూడా మాట్లాడుతున్నామని తెలిపారు. బీచ్ రోడ్ అభివృద్ధి కూడా ఒక ప్రత్యామ్నాయంగా యోచిస్తున్నట్లు వెల్లడించారు. విజయనగరం జిల్లా ప్రజా ప్రతినిధుల కోరిక మేరకు, జొన్నాడ టోల్ గేట్‌ను తరలించే విషయంపై, సంబంధిత అధికారులతో మాట్లాడతామని రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఆర్‌డిఒ ఎంవి సూర్య కళ, జిఎంఆర్ గ్రూప్ సంస్థల డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఐ. ప్రభాకరరావు, సిఇఒ మన్మోయ్ రాయ్, ప్రాజెక్టు హెడ్ రామరాజు, ఇతర ప్రతినిధులు, అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్నాయుడు



ఎయిర్‌పోర్టు పనులపై అధికారులతో సమీక్షిస్తున్న కేంద్రమంత్రి కింజరాపు

అనుచిత పోస్టులు పెడితే చర్యలు

కుల, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టినా ఉపేక్షించబోం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

సోషల్ మీడియాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా అనుచితమైన పోస్టులు పెట్టి, విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో వాస్తవాలను వక్రీకరిస్తూ మతాలను, కులాలను, పార్టీలను రెచ్చగొడుతూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్‌లలో ఎవరికి తోచిన విధంగా వారు పోస్టులు పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై జిల్లా పోలీసుశాఖ ప్రత్యేకంగా నిఘా పెట్టిందన్నారు. ఇందుకుగాను ఒక పోలీసు బృందాన్ని ప్రత్యేకంగా నియమించి, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. ఈ బృందం అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకొని, విద్వేషాలను రెచ్చగొట్టే ఉద్దేశంతో పోస్టులు పెట్టిన వ్యక్తుల వివరాలను రాబట్టి, వారికి నోటీసులు జారీ చేసి, వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు ఉపక్రమిస్తుందన్నారు. ఈ బృందం ఒక ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఒక ఎస్‌ఐ, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఆరుగురు పోలీసు సభ్యులతో పని చేస్తుందని తెలిపారు. కావున, ప్రజలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారాల్లో విజ్ఞతతో వ్యవహరించాలన్నారు. సోషల్ మీడియాను పాజిటివ్ విషయాలను విస్తతం చేసేందుకు, దూర ప్రాంతాల్లో ఉన్న మిత్రులు, బంధువులను దగ్గరి చేర్చే విధంగా వినియోగించుకోవాలని కోరారు. యువత, ప్రజలు సోషల్ మీడియాను పాజిటివ్ కోణంలో వినియోగించుకొని, సాంకేతికతను అందిపుచ్చుకొని, నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకోవాలని సూచించారు.



వినేష్ ఫొగాట్‌పై బిజెపి నాయకుడు అసభ్యకర వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిస్ ఒలంపిక్స్ లో 100 గ్రాముల బరువు ఎక్కువైందని అనర్హత వేటుకు గురైన వినేస్ ఫొగాట్ మానసికంగా కంగిపోతుంటే దేశమంతా ఆమెకు మద్దతుగా నిలబడిన వేళ బిజెపినాయకుడు ఆమె పట్ల అసభ్యకర వ్యాఖ్యలుచేయడం దుర్మార్గమని ఐద్వాజిల్లా కార్యదర్శి పి.రమణమ్మ అన్నారు. ఒక మహిళ అని చూడకుండా బట్టలు విప్పేస్తే 100 గ్రాములు బరువు తగ్గి పోతుంది కదా అని మాట్లాడడం సభ్య సమాజం సిగ్గు పడుతోందని, తక్షణమే వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకులు ఎంత ఆటవికంగా ఆలోచిస్తున్నారో చెప్పేందుకు ఈ సంఘటనే సాక్ష్యమని అన్నారు. ఒక వైపు మహిళా క్రీడాకారుల పట్ల బ్రిజ్ భూషణ్ పెట్టిన వేధింపులు, లైంగిక దాడులకు వ్యతిరేకంగా పోరాడి నేడు ఒలింపిక్స్ క్రీడల్లో ఒకే రోజూ ముగ్గురిని ఓడించి ఫైనల్ కు వచ్చి బంగారపతకం దేశానికి వస్తుందని కోట్లాది మంది ఎదురుచూశారని, ఆ సమయంలో 100 గ్రాములు బరువు పెరిగారని అర్హత వేటు వేయడంతో నిరాశకు గురయ్యారని తెలిపారు. ఇటువంటి సమయంలో బిజెపి నాయకుడు అభ్యంతకర వ్యాఖ్యలు చేయడం అత్యంతదుర్మార్గమని అన్నారు. వెంటనే వినేష్ ఫొగాట్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

వీరుల త్యాగాలు మరువలేనివి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- విజయ నగరం కోట

వీరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతి రాజు అన్నారు. ఆదివారం జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం, ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న, పలువురు యోధులను, 1971 బంగ్లాదేశ్‌తో యుద్ధంలో క్షతగాత్రులైన మాజీ సైనికుల భార్యలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సైనికుల సేవలు సమాజానికి, దేశానికి ఎంతో అవసరమని అన్నారు. ఈరోజు ప్రజలంతా సురక్షితంగా ఉన్నారంటే, మన సైనికులే కారణమని, తమ దృష్టికి వచ్చిన వీరి సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని తెలిపారు. 2009లో గాజులరేగ లో ఆనాడు కలెక్టర్ 351 మంది మాజీ సైనికులకు ఇచ్చిన స్థలాన్ని సబ్ డివిజన్ చేయలేదని తన దృష్టికి వచ్చిందని అన్నారు. ఆ భూమి సబ్ డివిజన్ అవ్వన్నంతవరకు నిర్మాణాలు జరిగే పరిస్థితి లేదని , బ్యాంకులో రుణాలు ఇచ్చే పరిస్థితి లేదని ,రెవెన్యూ అధికారులు ఈ విషయం గ్రహించి వీలైనంత తొందరగా సైనికులు ఇచ్చిన ఇళ్ల స్థలాలు సబ్ డివిజన్ చేయాలని కోరారు. జిల్లాలో మిలటరీ ఆసుపత్రి , సర్వేనెంబరు 95/4 లో గాజులరేగ రెవెన్యూ లో పోలి క్లినిక్, నిర్మాణం కొరకు గాజులు రేగలోఇచ్చిన స్థలాన్ని సైనిక సంక్షేమానికి త్వరగా అప్పగించాలని కోరినందున దాన్ని కూడా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు దేవర ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బారుకుల వెంకటరావు, ఉపాధ్యక్షులు లక్ష్మారెడ్డి, మనోహర్ రెడ్డి, మండపాక భారతి, దేవరలక్ష్మి, కె .ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ సైనికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు

గ్రామస్తులు వద్దన్నా క్వారీ ఏర్పాటు తగదు

- జిఎంఆర్‌కు ఇచ్చిన క్వారీ అనుమతులు రద్దు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి- భోగాపురం

రామచంద్రపేట గ్రామస్తులు వద్దన్నా క్వారీ ఏర్పాటు చేయడం దారుణమని సిపిఎం కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. వెంటనే జిఎంఆర్ సంస్థకు ఇచ్చిన క్వారీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని రామచంద్రపేట గ్రామాన్ని ఆయన ఆదివారం ఉదయం సందర్శించారు. క్వారీ సమస్యపై గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా క్వారీ వలన తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ముందు ఏకరువు పెట్టారు. బాంబు పేలుళ్లకు ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని అన్నారు. దాని నుంచి వచ్చే శబ్దానికి ఇంటి పైకప్పు శ్లాబు పెచ్చులు రాలిపోతున్నాయని చెప్పారు. పేలుళ్ల వల్ల ధూళి ఇళ్లల్లోకి వచ్చేస్తుందని అన్నారు. దీనివల్ల గ్రామంలో చాలా మంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. ప్రజాప్రతినిధులు కూడా తమను పట్టించుకోవడం లేదని ఆయనకు తెలిపారు. పోలీసుల పహారా మధ్య క్వారీ పనులను నిర్వహిస్తున్నారని అన్నారు. అర్ధరాత్రి వచ్చి పోలీసులు నోటీసులు ఇచ్చారని అన్నారు. అలాగే క్వారీ పనులను అడ్డుకుంటే కేసులు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సూర్యనారాయణ మాట్లాడుతూ మీరంతా ముందుకొస్తే దీనిపై తప్పనిసరిగా పోరాటం చేస్తామన్నారు.

క్వారీ అనుమతులు వెంటనే రద్దు చేయాలి

గ్రామస్తులు వద్దన్నాసరే క్వారీ ఏర్పాటు చేయడం చాలా దారుణమని, వెంటనే అనుమతులు రద్దు చేయాలని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. భోగాపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు క్వారీ వద్దని చెప్పినప్పటికి ప్రభుత్వం ఎలా అనుమతులిచ్చిందని ప్రశ్నించారు. ఉన్న క్వారీలతోనే గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేస్తే ఇక గ్రామాన్ని ఖాళీ చేయడమే ఉందని అన్నారు. రామచంద్రపేట గ్రామస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులకు ఉందన్నారు. అందుకు క్వారీ అనుమతులు రద్దు చేసి వారికి భద్రత కల్పించాలని అన్నారు. గ్రామపెద్దలకు అర్ధరాత్రి వేళ నోటీసులు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సిపిఎం దీన్ని ఖండిస్తుందన్నారు. క్వారీ అనుమతులు రద్దుచేయకపోతే ఉద్యమిస్తామని తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, స్థానిక నాయకులు బచ్చల సూర్యనారాయణ పాల్గొన్నారు.



రామచంద్రపేటలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ

జీవో 117 రద్దు చేశాకే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జీవో నెంబర్ 117ను రద్దు చేశాకే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పాల్తేరు శ్రీనివాస్ కోరారు. జిల్లా ఎపిటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యాశాఖలో అన్ని కేడర్లలో ఉద్యోగోన్నతులుకల్పించి సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కోరారు. తర్వాత మాత్రమే వర్క్ అడ్జస్టెమెంట్ చేయాలని అన్నారు. సిబిఎస్‌ఇ విధానాన్ని రద్దుచేసి రాష్ట్ర మొత్తం ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలలో రద్దు చేసిన ప్రధానోపాధ్యాయ పోస్టులను కేటాయించాలన్నారు. అన్ని యుపి స్కూళ్లల్లో పిఇటి పోస్టు కేటాయించాలన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియం రెండూ కొనసాగించాలని, మూడు, నాలుగు, ఐదు తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి వెనక్కి పంపాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ కర్రి రవి, జిల్లా బాధ్యులు మజ్జి రమేష్, బడే సుగుణాకర్ నాయుడు, కర్రి కోటేశ్వరరావు, జె.బి.జగదీశ్వర్ రావు, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య విద్యార్థి ఆవిర్భావం సందర్భంగా

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఆటల పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐక్య విద్యార్థి ఆవిర్భావ దినోత్సవ సంబరాల్లో భాగంగా ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక విజ్జి స్టేడియంలో సంక్షేమ హాస్టల్ విద్యార్థులతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. పలు సంక్షేమ హాస్టల్స్ నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె. రవికుమార్ మాట్లాడుతూ దేశంలో 1936 ఆగస్టు 12న మొదలైన విద్యార్థి ఉద్యమాలు నేటి వరకు విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సాగుతున్నాయని తెలిపారు. వీటిని నేటితరం విద్యార్థులకు తెలియజేయా లనే దృకృథంతో ఐక్య విద్యార్థి ఆవిర్భావ దినోత్సవాలు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. విద్యార్థులలో చదువుతోపాటు ఆటల పట్ల ఆసక్తి కలిగించాలని ఉద్దేశంతో వారిలో వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం ఎస్‌ఎఫ్‌ఐ ఇటువంటి ఆటల పోటీలు నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో క్రీడారంగంలో మన దేశం తరతరాలుగా వెనుకబడి పోతుందని అన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి తరగతి గదుల్లో ఎలాగైతే ప్రతిరోజూ పాఠాలు బోధిస్తారో, అలాగే ప్రతిరోజు ఆటలు ఆడుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన వారికి ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కె .రాజు, పి రమేష్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మురళి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఎస్‌సి వర్గీకరణను వ్యతిరేకిద్దాం : మాలమహానాడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మృత వీరుల పోరాట స్ఫూర్తితో ఎస్‌సి వర్గీకరణను వ్యతిరేకిద్దామని మలమహానాడు రాష్ట్ర కార్యదర్శి లోగిశ రామకృష్ణ అన్నారు. ఎస్‌సి వర్గీకరణ వద్దని పోరాడి ప్రాణాలర్పించిన మృతుల త్యాగాలను గుర్తు చేసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం మాల మహానాడ కార్యాలయంలో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. మాలల రిజర్వేషన్లు కాపాడాలని, ఎస్‌సి వర్గీకరణ వద్దు-ఐక్యతే ముద్దు, ప్రాణామైనా అర్పిస్తాం - వర్గీకరణ ఆపేస్తాం అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా నాయకులు చోళ్ల సింహాచలం, మైలపల్లి నాగరాజు, సిర్లి ఆనంద్, అడపాక మురళి, కోరాడ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్‌కు పూర్వ వైభవం

గ్రామీణ ప్రాంతాల్లో 4జి సేవలు అందించేందుకు చర్యలు ● 'ప్రజాశక్తి'తో బిఎస్‌ఎన్‌ఎల్ డిజిఎం దాలినాయుడు

ఉమ్మడి జిల్లాలో ప్రజలు, వినియోగదారుల సహకారంతో బి ఎస్‌ఎన్‌ఎల్ సేవలు మరింత విస్తృతం చేసేందుకు, పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని బిఎస్‌ఎన్‌ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.దాలినాయుడు తెలిపారు. ప్రభుత్వ సంస్థ అయిన బిఎస్‌ఎన్‌ఎల్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ప్రజలందరిపైనా ఉందని అన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

– ప్రజాశక్తి, విజయనగరం టౌన్



☞ ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం బిఎస్‌ఎన్‌ఎల్ సేవలు పొందుతున్న వారు ఎంతమంది?

ఉమ్మడి జిల్లాలో ల్యాండ్ కనెక్షన్లు 1500, ప్రీపెయిడ్ కలెక్షన్లు 3 లక్షలు, ఫైబర్ కలెక్షన్లు 3500 ఉన్నాయి.

☞ ఉమ్మడి జిల్లాలో బిఎస్‌ఎన్‌ఎల్ సేవలు ఎలా ఉన్నాయి?


బిఎస్‌ఎన్ఎల్ ద్వారా సేవలందించేందుకు ఉమ్మడి జిల్లాలో 270 టవర్లు ఉన్నాయి. నిర్మాణంలో మరికొన్ని టవర్లు ఉన్నాయి. అవన్నీ సెప్టెంబర్ నెలలో అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. జిల్లాలో 16 ఎక్స్చేంజీల ద్వారా సేవలు అందిస్తున్నాం.

☞ ప్రైవేటు కంపెనీలకు దీటుగా మెరుగైన సేవలు అందించేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

– ప్రైవేటు, కార్పొరేట్ కంపెనీలకు ధీటుగా బిఎస్‌ఎన్‌ఎల్ సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. అందులో భాగంగానే ప్రస్తుతం ఉన్న 270 సెల్ టవర్లు కంటే మారుమూల గ్రామాలకు సైతం విస్తరించేందుకు మరో 57 టవర్లు నిర్మాణం చేపడుతున్నాం. సెప్టెంబర్ నెలాఖరు నాటికిఇ వినియోగంలోకి తీసుకు వస్తాం. ప్రతి గ్రామంలోను సెల్ ఫోన్ సిగ్నల్స్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

☞ ప్రైవేటు నెట్ వర్క్ సంస్థలు రీ ఛార్జి ధరలు విపరీతంగా పెంచిన నేపథ్యంలో దీని ప్రభావం బిఎస్‌ఎన్‌ఎల్‌పై ఎలా ఉంది?

జియో, ఎయిర్‌టెల్, ఐడియా వంటి సంస్థలు రీఛార్జి ధరలు విపరీతంగా పెంచడం వల్ల బిఎస్‌ఎన్‌ఎల్ వైపు ప్రజలు మొగ్గ చూపుతున్నారు. ఇప్పటికే సుమారుగా 8వేల మంది వరకు నెట్ వర్క్ మారిన వారు, కొత్త సిమ్‌లు తీసుకున్న వారు ఉన్నారు.



☞ ఉమ్మడి జిల్లాలో 4 జి సేవలు విస్తరించేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

దేశ వ్యాప్తంగా 4జి సేవలు విస్తరించేందుకు బిఎస్‌ఎన్‌ఎల్ సంస్థ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మన జిల్లాల్లో చర్యలు చేపట్టాం. ఇప్పటి వరకు పాత బ్యాటరీలతో నడుస్తున్న వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఉన్న అన్ని టవర్లనూ 4జి సేవలు అందించే విధంగా దేశీయ టెక్నాలిజితో తయారు చేస్తున్నాం. విజయనగరం జిల్లా కేంద్రంలో 56 టవర్లు 4 జి సేవలు అందిస్తున్నాయి. వాటిని కోర్ ఎక్యూప్‌మెంట్ అనుసంధానం చేస్తున్నాం.

☞ 4జి సేవలు పొందాలంటే ఎటువంటి మార్పులు చెయ్యాలి? రుసుం ఏమైనా చెల్లించాలా?

4జి సేవలు పొందాలంటే ఎటువంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదు. ఉచితంగానే 4జి లోకి మార్చుకోవచ్చు. 4 జి సేవలు అందుబాటులోకి రావడంతో ఇప్పటి వరకు 8వేలకు పైగా 4జిలోకి వినియోగదారులు మారారు.

☞ ఏదైనా సమస్య చెబితే బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు సకాలంలో రావడం లేదనే విమర్శ ఉంది. సరిపడా సిబ్బంది ఉన్నారా? సమస్యల పరిష్కారం కోసం తీసుకునే చర్యలు ఏమిటి?

బిఎస్‌ఎన్‌ఎల్‌లో ఎక్కువ మంది ఉద్యోగులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఉద్యోగుల సంఖ్య తగ్గడం వాస్తవం. అయితే అదే క్రమంలో ప్రజలకు సేవలు అందించే విషయంలో,సమస్యలు పరిష్కారం చేసే విషయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సిద్దంగా, అందుబాటులో ఉన్నారు. ఏ సమస్యపై ఫిర్యాదు వచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నాం.

☞ వినియోగదారులకు మీరిచ్చే సందేశం ఏమిటి?

వినియోగదారుల సహకారంతో బిఎస్‌ఎన్‌ఎల్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. మా సేవలు పొందడం ద్వారా అధిక రీఛార్జిల వడ్డన ఉండదు. మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. ప్రజలకు మెరుగైన మొబైల్, ఇంటర్నెట్, ఫైబర్, ల్యాండ్ లైన్ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.



డ్రమ్‌సీడర్‌పై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

డ్రమ్ సీడర్ సాగుతో రైతుకు లాభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డ్రమ్ సీడర్ వరి సాగుతో రైతుకి లాభమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం దేవునినెలివాడ, తంగుడుబిల్లి గ్రామాల్లో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రమ్ సీడర్ పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రమ్ సీడింగ్ పద్ధతిలో నాటడం ద్వారా రైతులకు ఎకరానికి రూ. 6వేల పెట్టుబడి ఖర్చు తగ్గి ఆదాయం, దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చందక చిన్నం నాయుడు మాధవరావు మాస్టర్, అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ ఎంఎస్ఎన్ మూర్తి, ఓటర్ అక్షరాక్షత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు సంయుక్తంగా డిఎస్‌సికి ఉపయోగపడే 2,400 రూపాయల విలువ గల అకాడమీ బుక్స్‌ను ఆదివారం అందించారు. డిఎస్‌సికి సిద్ధమవుతున్న వారికి ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ తెలిపారు.


చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను అభినందిస్తున్న గొంప వెంకటరావు, తదితరులు

చైర్మన్, వైస్ చైర్మన్‌కు అభినందనలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కు నాయుడుపేట ఎపి ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ఏడవక భవానీ, వైస్ చైర్మన్ గుడివాడ శ్రీనులను టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆదివారం అభినందించారు. పాఠశాల అభివృద్ధికి అతీతంగా కృషి చేయాలని కోరారు.

తెలంగాణకు విస్తరించిన ట్రస్ట్ సేవలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని మంగళపాలెం వద్ద గల గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ సేవలు తెలంగాణ రాష్ట్రానికి విస్తరించాయి. తెలంగాణ రాష్ట్రం, కోదాడ జిల్లా, మెళ్ళచేరువు గ్రామంలో వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ కార్యక్రమాన్ని ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ కుమార్ ఆదివారం చేపట్టారు. మహా సిమెంట్ వారి ఆర్థిక సహకారంతో కెవి చౌదరి (ఫార్మర్ సివిసి) నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెళ్ళచేరువు, ఇతర గ్రామాల నుంచి వచ్చిన 170 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్, ట్రైసైకిళ్లను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఐపిఎల్ విఎస్ నారంగ్, మహాపిల్ జనరల్ మేనేజర్ ఎంఆర్ మోహన్‌రావు, వైస్ చైర్మన్ జె.వినోద్‌రావు, లోరస్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సిఐగా రవికుమార్ బాధ్యతలు

ప్రజాశక్తి - వేపాడ

ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోగల బొద్దాం రూరల్ సిఐగా కె.రవికుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

దశపర్ణి కషాయం తయారీ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని కొంపల్లి యూనిట్‌లో ఎన్‌కెఆర్‌పురం, చిన్నగుడిపాల గ్రామాల్లో మహిళా సంఘాలతో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆదివారం దశపర్ణి కషాయం తయారీ చేయించారు. డిఎల్‌ఎమ్‌పి స్వామి నాయుడు మాట్లాడుతూ ఈ దశపర్ణి కషాయం వరిలో వచ్చి తెగుళ్లు, పురుగుల నివారణకు, చీడపీడల నివారణకు పనిచేస్తుందన్నారు. ప్రతి రైతు రసాయన పురుగు మందులను వాడకుండా కషాయాలను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సన్యాసమ్మ, యూనిట్ ఇంచార్జ్ నారాయణమ్మ, ఐసిఆర్‌పి దేవుడు, వెంకటరావు, రవణమ్మ, రామలక్ష్మి, గ్రామ పెద్దలు వంటాకు నాయుడు బాబు, బోజంకి సన్యాసిరావు, రైతులు పాల్గొన్నారు.

దెందేరులో వైద్యశిబిరం

ప్రజాశక్తి - కొత్తవలస

సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ట్రస్ట్ వ్యవస్థాపకుడు కనకాల శివ ఆధ్వర్యంలో దెందేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 116 మంది పాల్గొనగా, వీరికి పరీక్షలు చేసి ఇందులో నలుగురిని కెన్సర్ వ్యాధి లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. వీరిని విశాఖపట్నం ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ సుధానంద, డాక్టర్ శ్వేతా, డాక్టర్ రమ్య. పిఆర్ఒ నాయుడు, సిబ్బంది, దెందేరు మాజీ సర్పంచ్ విరోతి శివాజీ, జామి సూరిబాబు, గణిశెట్టిపాలెం వైస్ సర్పంచ్ జామి కొండలరావు యువకులు పాల్గొన్నారు.

అయ్యరక యువజన అధ్యక్షునిగా పెదిరెడ్ల

ప్రజాశక్తి - కొత్తవలస

నియోజకవర్గ అయ్యరక యువజన సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం స్థానిక అయ్యరకుల సంఘం భవనంలో నిర్వహించారు. మండలంలోని కొత్తసుంకరపాలెం గ్రామానికి చెందిన పెదిరెడ్ల వెంకటసత్యనారాయణ (శ్రీను)ను అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కర్రి సూర్యనూకరాజు, కోశాధికారిగా లెంక ఈశ్వరరావు, అసోషియేట్ అధ్యక్షులుగా దన్నిన రవికుమార్, ఉపాధ్యక్షులుగా రామదాసు తదితరులును ఎన్నుకున్నారు.

ఉద్యోగోన్నతుల తర్వాతే పని సర్దుబాటు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

అన్ని కేడర్ల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చిన తరువాతే పని సర్దుబాటు ప్రక్రియను నిర్వహించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జె సి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్‌జిహోమ్‌లో ఏర్పాటు చేసిన డివిజనల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 117వ జిఒ రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అదే జిఓతో పని సర్దుబాటు చేయటం అన్యాయమన్నారు. శాస్త్రీయత లేకుండా పని సర్దుబాటు చేస్తున్నారన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి పద్మావతి మాట్లాడుతూ 53వ జిఒ ప్రకారం పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో కనీసం 4 పాఠశాల సహాయకులు పోస్టులు కొనసాగించాలని, ఆంగ్ల భాష బోధనకు పాఠశాల సహాయకులను నియమించాలని కోరారు. సమావేశంలో ఎపిటిఎఫ్ నాయకులు ప్రవీణ్ కుమార్, సింహాచలం, కె శ్రీను, పరుశునాయుడు, రామకృష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా రజక సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక విజయనగరం ప్రజా గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. ముందుగా రజక సంఘం నాయకులు మలిచర్ల దుర్గారావు 63వ జన్మదిన సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు తెల్ల సత్యం మాట్లాడుతూ రజకులపై గ్రామాల్లో దాడులు, బహిష్కరణలను వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ దేవాలయాల్లోనూ, ఆస్పత్రుల్లోను తమకు కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలన్నారు. రాష్ట్ర రజిక చైర్మన్ గుర్జాపు రామును ప్రకటించాలని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు మలిచర్ల చిట్టితల్లి వైస్ ప్రెసిడెంట్ తామడచ్చన్న , కార్యదర్శి కొల్లేటి శ్రీను, సహాయ కార్యదర్శి వెలుదూటి నాగరాజు, జిల్లా బోర్డు మెంబర్ సలాది అప్పలస్వామి, కోశాధికారి ఏలూరు గురుమూర్తి, ముఖ్యఅతిథిగా షణ్ముఖరావు, బోడి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సహారా బాధితుల ధర్నాకు కదలిరండి

ప్రజాశక్తి- బొబ్బిలి

సహారా ఖాతాదారులకు మొత్తం పేమెంట్ వెంటనే చెల్లించాలని ఆగస్టు 14న ఎన్‌టిఆర్ బొమ్మ సెంటర్ నుండి ప్రదర్శన, ఆర్‌టిసి కాంప్లెక్స్ సెంటర్లో ధర్నాకు ఖాతాదారులు పెద్ద ఎత్తున రావాలని సహారా ఖాతాదారుల పోరాట కమిటీ విజయనగరం జిల్లా అధ్యక్షులు బి. లక్ష్మీ దాస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సహారా ఇండియా ఆస్తులను కొల్లగొట్టేందుకు ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. దేశంలో మొత్తం 13 కోట్ల మంది ఖాతాదారులు, 12 లక్షల మంది ఏజెంట్లను నిలువునా ముంచేయడానికే భారత హోమ్ మినిస్టర్ అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఖాతాదారులకు డబ్బులు చెల్లిస్తామంటే ఖాతాదారులే రావడం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి తప్పుడు ప్రచారం చేస్తున్నారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. 6 లక్షల కోట్లకు పైగా ఆస్తులు ఉన్నప్పటికీ 3లక్షల కోట్లు ఖాతాదారులకు ఇవ్వాల్సి ఉండగా ఇవి చెల్లించకుండా ఈ ఆస్తులు అన్ని బిజెపి పెద్దలు తినేయడానికి చూస్తున్నారన్నారు 13 కోట్ల మంది ఖాతాదారులను దగా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ దుర్మార్గానికి వ్యతిరేకంగా ఆగస్టు 14 జరిగే ప్రదర్శన ధర్నాలో పెద్ద ఎత్తున ఖాతాదారులు పాల్గొవాలని కోరారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శంకరరావు, లక్ష్మీదాస్

ఎమ్మెల్యే దృష్టికి ఇండోర్ స్టేడియం సమస్య : ఆనంద్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్లలో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంని మంజూరు చేసేటట్లు నెల్లిమర్ల ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకువెళ్తానని టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ హామీ ఇచ్చారు. క్రీడాకారులు దీర్ఘకాలికంగా స్టేడియం లేక ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేటట్లు తన వంతు కృషి చేస్తానని అన్నారు. నెల్లిమర్ల షటిల్ బ్యాడ్మింటెన్ అసోసియేషన్ ఇచ్చిన విన్నపం మేరకు ఆయన సానుకూలంగా స్పందించారు. నెల్లిమర్ల ప్రాంతంలో సుమారుగా 200 మంది క్రీడాకారులు ఉన్నారన్నారు. సరైన వసతి లేకపోయినప్పటికీ రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా ఈ ప్రాంతం నుంచి బ్యాడ్మింటెన్ పోటీలలో పాల్గొన్నారని ఆయనకి అసోసియేషన్ సభ్యులు వివరించారు. ఇండోర్ స్టేడియం మంజూరుచేసినట్లయితే నెల్లిమర్ల నుంచి మరింత మంది ఈ క్రీడలో రాణించేందుకు వీలు ఉంటుందన్నారు. ఈ మేరకు ఆనంద్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఇండోర్ స్టేడియం సమస్యని ఎమ్మెల్యే మాధవికి తెలియజేస్తామన్నారు. ఖచ్చితంగా క్రీడా వసతి కల్పించేటట్లు చూస్తామన్నారు. క్రీడల పట్ల ఎమ్మెల్యేకి ప్రత్యేక ఆసక్తి ఉందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడమే ఆమె లక్ష్యమని చెప్పరు. ఈ సమస్యను ఆమెకు వివరించి, స్థలంతో పాటు ఇండోర్ స్టేడియం కూడా మంజూరు అయ్యేటట్లు చూస్తామని హామీ ఇచ్చారు. ఆనంద్ కుమార్‌ని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు పి. పైడిరాజు, వి.ఎం.కె. లక్ష్మణరావు, పంచాది కిరణ్, లెంక శ్రీను, జయప్రకాశ్, శేఖర్ తదితరులు ఉన్నారు.


క్రీడాకారులతో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

గురుకులంలో మిగులు సీట్లకు ప్రవేశాలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులంలో మిగులు ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ యు.ఉషారాణి తెలిపారు. 2024-25వ సంవత్సరానికి ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు టిసి, స్టడీ, స్టూడెంట్, మదర్, ఫాదర్ ఆధార్ జెరాక్సులు, కుల, ఆదాయ ధృవపత్రం, 5 కలర్ ఫొటోస్ డైరెక్ట్‌గా స్కూల్‌కి వచ్చి అడ్మిషన్ పొందవచ్చు నన్నారు. 5వ తరగతిలో ఎస్‌సికి 35 సీట్లు, 6వ తరగతికి 8 సీట్లు, 7వ తరగతికి 13 సీట్లు, 8వ తరగతికి 14 సీట్లు, 9 తరగతికి 13 సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియేట్ ఎంపిసి గ్రూప్‌లో ఎస్‌సి కేటగిరిలో 4 సీట్లు కాలి ఉన్నాయన్నారు. ఇంటర్‌లో ఖాళీ ఉన్న సీట్లకు పదో తరగతి సప్లమెంటరీలో ఉత్తర్ణత సాధించిన వారు కూడా అర్హులేనన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు.

టేకు దుంపలు పంపిణీ


ప్రజాశక్తి- శృంగవరపుకోట

గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రైతులకు వెయ్యి టేకు దుంపలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక బార్ అసోసియేషన్ కోశాధికారి బి.త్రిమూర్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ మాట్లాడుతూ సామాజిక అడవులు పెంచాలనే వారికి జియో సంస్థ ద్వారా రాయితీపై టేకు దుంపలను పంపిణీ చేస్తున్నామన్నారు. కావలసినవారు 9391138665 నెంబరుకు ఫోన్ చేయవచ్చున్నారు. వేపాడ, యస్.కోట, కొత్తవలస మండలాల రైతులు లబ్ధిపొందారన్నారు. కార్యక్రమంలో కొట్యాడ ఈశ్వర రావు, బి.హృషీకేశ్, లాస్యశ్రీ పాల్గొన్నారు.

క్వారీ లారీలతో రోడ్డు ఛిద్రం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో సోంపురం జంక్షన్ నుంచి వేపాడ మీదుగా ఆనందపురం వరకు వెళ్లే ప్రధాన రహదారిపై క్వారీ లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు ఛిద్రమవుతోంది. పరిమితికి మించి బరువుతో రవాణా సాగించడం వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గ్రామీణ రహదారులపై పరిమితికి మించిన బరువులతో వాహనాలు నడపకూడదన్న నిబంధనలున్నప్పటికీ తుంగలో తొక్కి రహదారులను మరమ్మతులకు గురిచేస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్ల గజానికో గొయ్యిలా రహదారులు తయారవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిమితికి మించి రవాణా సాగిస్తున్న క్వారీ లారీలపై తగు చర్యలు తీసుకుంటే తప్ప రోడ్డు బాగుపడే అవకాశం లేదని ప్రయాణికులు చెబుతున్నారు.


శిథిల రోడ్డులో వెళుతున్న భారీ లారీ

రోడ్డు నిర్మించరూ..!

ప్రజాశక్తి- బాడంగి


మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని ఎరుకుల పాకలు గ్రామానికి రహదారిని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ గ్రామానికి ఉన్న చిన్నపాటి మట్టిరోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నామని ఎంపిటిసి పాలవలస గౌరు చెప్పారు. మట్టి రోడ్డు కాకుండా మెటల్ రోడ్డు కానీ సీసీ రోడ్డు కానీ వేసి ప్రజల కష్టాలను తీర్చాలన్నారు. 2004లో అప్పటి ఎమ్మెల్యే కీర్తిశేషులు తెంటు జయప్రకాశ్ ఎరుకుల పాకలు నుంచి లక్ష్మీపురం గ్రామానికి రోడ్డు నిర్మాణ నిమిత్తం రూ.7లక్షల నిధుల రూపంలో కేటాయించారని బిల్లులు అవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయని చెప్పారు. ఏ అవసరమైనా గ్రామస్తులంతా కచ్చితంగా లక్ష్మీపురం వెళ్లాల్సి వస్తుందని రోడ్డు లేకపోతే ఎలా వెళ్లేదని ప్రశ్నించారు. ముఖ్యంగా రేషన్ సరుకులు నిమిత్తం వృద్ధులు, మహిళలు, పొలాల మధ్యలో నుంచి వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఎరుకులపాకల గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ఎరుకుల పాకల నుంచి లక్ష్మీపురం వెళ్లడానికి రోడ్డు కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.


రోడ్డును చూపిస్తున్న గౌరు


మంత్రి సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- గంట్యాడ

మండల కేంద్రానికి చెందిన 40 మంది వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరికి మంత్రి శ్రీనివాస్ ఆదివారం కండువాలు వేసి పార్టీలోనికి సాధారణంగా ఆహ్వానించారు. గ్రామపంచాయతీ వార్డు మెంబర్లు గొర్లె కుమారి, సెడగం నారాయణమ్మ, సోము కాళీలతో పాటు పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, గంట్యాడ మాజీ సర్పంచ్ రఘుమండ లక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర నాయుడు, అల్లు విజయ్ కుమార్, బూడి గాంధీ, రంది చినరామనాయుడు, కొండపల్లి పైడితల్లి నాయుడు, పెద్దిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.


వేపాడ: సర్పంచ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

వేపాడ : మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్ద బుద్ధ అప్పలనాయుడు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే లలిత కుమారి స్వగృహంలో వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి నాయకత్వంలో ఎమ్మెల్యే లలిత కుమారి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల బుచ్చి రాంప్రసాద్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అయితే టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావుకు తెలియకుండా పార్టీలో చేర్చుకోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.


గంట్యాడ: పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి శ్రీనివాస్

అధిష్టానానికి ఫిర్యాదు చేస్తా

మండల టిడిపి అధ్యక్షులు గొంప వెంకటరావు

మండలంలో ఎవరైనా టిడిపిలో చేరితే నిబంధనలు ప్రకారం పార్టీ మండల అధ్యక్షులుగా నాకు చెప్పాలి. కానీ ఎమ్మెల్యే నిబంధనలను తుంగలో తొక్కి నాకు కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా జాకేరు వైసిపి సర్పంచ్‌ను టిడిపిలో చేర్పించుకున్నారు. దీనిపై టిడిపి అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాను. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఎలా? కాపు, వెలమ అని కుల రాజకీయాలు ఎంతవరకు సమంజసం. కనీసం జాకేరులో మొదటి నుంచి టిడిపిలో ఉన్న మాజీ జెడ్‌పిటిసి కలవరపెల్లి జక్కన్న దొర కుమారుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు శంకర్రావుకు, గ్రామ కార్యదర్శి అప్పల రాము కూడా సమాచారం లేకుండా పార్టీలో చేర్పులు చేసుకోవడం సబబు కాదు. ఇటువంటి చర్యలను నాతో పాటు సీనియర్ నాయకులు, కార్యకర్తలు కూడా ఖండిస్తున్నారు. ఒక ఎమ్మెల్యే ఇటువంటి కార్యక్రమాలకు పూనుకుంటే మా పరిస్థితి ఏంటని కార్యకర్తల్లో ఆందోళన మొదలైంది. ఇది మాత్రం పార్టీకి, ఆమెకు మంచిది కాదు. దీనిపై నేను కచ్చితంగా అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాను.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- గంట్యాడ

మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్యనారాయణ(53) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు వివరాలు ప్రకారం.. గంట్యాడ గ్రామానికి చెందిన ఏలూరు సత్యనారాయణ తన స్వగృహం నుంచి టివిఎస్ మోపెడ్ బండిపై జాతీయ రహదారి మీదుగా ఈ నెల 6న వెళుతుండగా శివాలయం సమీపంలో కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంట్యాడ ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపారు.

మృత దేహం లభ్యం

ప్రజాశక్తి - విజయనగరం కోట

స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆదివారం నాలుగో నెంబరు ఫ్లాట్‌ఫారంపై గుర్తు తెలియని మృత దేహం లభ్యమైంది. సుమారు 35 నుండి 40 సంవత్సరాలు వయస్సు గల పురుషుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుని వంటిపై నీలం రంగు ఆఫ్ హాండ్స్ షెర్టు, కాఫీ రంగు ప్యాంటు ఉన్నాయని చెప్పారు. మృతుని ఆచూకీ తెలిసినవారు ఈ నెంబరుకు 9490617089 ఫోన్ చేయాలని రైల్వే పోలీసులు తెలిపారు.

వివిఆర్ పేటలో గజరాజుల అలజడి

ప్రజాశక్తి - వంగర

మండలంలోని వివిఆర్‌పేటలో గజరాజుల గుంపు ప్రవేశించి అలజడి సృష్టించింది. మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం తోటపల్లి, నాగూరులో సంచరించిన గజరాజులు గుంపు వంగర మండలంలోకి ప్రవేశించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతేడాది మండలంలో పలు గ్రామాలలో సంచరించి పంటలను ధ్వంసం చేసి తరలి వెళ్లిన విషయం తెలిసిందే. అయితే మరోసారి వివిఆర్ పేటలోకి ప్రవేశించి సంచరించి మొక్కజొన్న, చెరకు, నీలగిరి తోటలు ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళన చెందుతున్నారు. వీటిని అటవీ ప్రాంతానికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు. తహశీల్దార్ డి ధర్మరాజు రెవెన్యూ సిబ్బందితో గ్రామంలో దండోరా వేయించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గజరాజుల వైపు ఎవరు వెళ్లొద్దని తెలిపారు. కాగా ఏనుగులు తిరిగిన ప్రాంతాన్ని ఫారెస్టు డిఆర్ఒ సుధీర్, బీట్ ఆఫీసర్ స్వప్న, పోలీసులు పరిశీలించారు.

విద్యుత్తు లైన్ల సరఫరా నిలిపివేత

ఏనుగులు విద్యుత్ స్తంభాలను ధ్వంసం చేస్తాయనే ఉద్దేశంతో మోటారు విద్యుత్తు లైను సరఫరా నిలిపివేసినట్లు ఎఇ వినయ్ కుమార్ తెలిపారు. గజరాజుల కదలికలను అటవీ శాఖ ట్రాకర్సు పరిశీలిస్తున్నారని ఆయన చెప్పారు.


పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

డ్రైవర్లకు బేసిక్ వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఎయిర్ బస్ డ్రైవర్లకు, కాంట్రాక్టు కార్మికులకు బేసిక్ వేతనాలు, లేబర్ చట్టాలు అమలు చేసే విధంగా డిపో మేనేజర్లు బాధ్యత వహించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసి రామ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్‌బిజి భవన్, సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నా లేబర్ చట్టాలు, కనీస వేతనాలు అమలు కావడం లేదని, ఎయిర్ బస్ యజమానులు, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహిస్తున్నారని చెప్పారు. సర్క్యులర్ ప్రకారం జీతం, వీక్లీ ఆఫ్ లు, ప్రభుత్వ సెలవులు అమలు కావడం లేదన్నారు. అద్దె బస్ టెండర్‌లో, ఆర్‌టిసి అధికారులతో జరిగిన ఒప్పందంలో పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని ఉన్నా పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 2012లో ఇచ్చిన కనీస వేతనాలను సవరించి డ్రైవర్లకు రూ.27500, కాంట్రాక్ట్ వర్కర్లకు రూ.25500 బేసిక్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి 6 నెలలకు పెరిగే డిఎను నోటీస్ బోర్డ్‌లో పెట్టాలన్నారు. ఈ సమస్యలపై రవాణా శాఖ మంత్రికి ,కార్మిక శాఖ కమిషనర్‌కి, ప్రభుత్వానికి వినతులు నివేదించామన్నారు. ఈ సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎ. జగన్ మోహన్ రావు, అధ్యక్ష, కార్యదర్శులు జెఎస్ఎన్ రాజు, జి.సురేష్, డిపో అధ్యక్ష కార్యదర్శులు మధు, వాసు, కోశాధికారి ధనుంజయ, కోటి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, AT CHEEPURAPALLI.
O.S. No. 25/2023

BETWEEN:
Nauduru Narasimha Murthy ....Plaintiff
AND:
Nauduru Gowreswaramma and 7 others, ...Defendants

Notice to the Defendant-8:
Nauduru Rajeswaramma W/o Narasimha Murthy, Rameswara Colony, Garividi Village, Vizianagaram District.

Hg. Date : 29-08-2024

పైన తెలిపిన కేసులో వాది మీ పై దావా దాఖలు చేసియున్నారు. సదరు కేసులో పై కోర్టు వారి నుండి డిఫెండెంట్-8 అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తము శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారము పై నెంబర్ కేసు తే 29-08-2024 దిన వాయిదా వున్నదని ఈ పత్రికముఖంగా తెలియపరుస్తూ సదరు తేది అనగా **తే 29-08-2024 దిన ఉదయం గం॥10.30 నిమిషాలకు** మీరు కానీ లేదా మీ తరపున వకీలు గారి ద్వారా కానీ పైకోర్టులో ప్రత్యక్షంగా హాజరు అయి మీ తరపున వాదనలు విన్నవించుకోవలెను. లేని యెడల పైన తెలిపిన కేసులో మీ పరోక్షమున విచారించి తీర్మాణించెదరని శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

//BY THE ORDER OF THE HONOURABLE COURT//

ఇట్లు
Ch. ప్రవీణ్ రాజు,
ప్లయింటిప్ తరపున న్యాయవాది,
విజయనగరం. Cell: 99668 96047

PUBLIC NOTICE

Under the Instructions of My Clients No.1 Sint G.V Rama Tulasi W/o Krishna Rao, R/o Hyderabad and No.2 Chapa Santosh Kumar, S/o Late Bhaskara Rao R/o Parvathipuram. I Issue this notice for information of General Public. My Client No.1 is the Owner of Building Property bearing Plot No. 150 In Survey No.1 556/1 etc and Survey No. 560/2A etc and 561/1 etc situated in 17th ward 29 Block of Belgaum Village Parvathipuram Municipality covered by L.P No 46/06/V Dt:09-06-2006 with Municipal Assessment Number: 1091013280 of the Parvathipuram Municipality, Purchased Vide Registered Sale Deed 5276/2022 Dt:04-10-2022. The above property is Under Occupation, Possession and Enjoyment of My Client No.2 By Virtue of a lease transaction arrangement in between My clients. Aggrieved by the illegal trespass attempts of The Chief Manager, State of Bank of India, Bazaar Branch, Parvathipuram and The Chief Manager SBI ROB Bobbili, My Client No.1 filed a suit O.S 86/2024 on the file of The Honourable Court of Junior Civil Judge Parvathipuram and My Client No.2 also filed a case W.P 14441/2024 on the file of Honourable High Court of A.P against the above Bank Officials. Both the Cases are pending in Courts and The Bank Officials are not filed necessary Counter/ Written Statement etc.

Public at large are informed that, during pendency of above Legal litigations if any Person / Concern/ organization makes any type of transactions like Agreement or Deed, or Negotiations etc with the above bank officials, Such Transactions Shall not bind up on my clients and the concerned shall be held responsible for the Same.

Therefore this Notice is Issued as an information to the Public.

Sri NAVEEN KOTTAKOTA, B.Tech, LLB
PARVATHIPURAM, Cell 9966966901